AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
10-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



2



2

మాజీ జడ్పీటీసీ మృతి


## కాంగ్రెస్ నేత కంచెట్టి గంగాధర్ మృతి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** కాంగ్రెస్ నేత కంచెట్టి గంగాధర్ మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మరణించారు. కాగా.. ఆయన అంత్యక్రియలను సుద్దపల్లిలో నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, వీజీ గౌడ్ తదితరులు గంగాధర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కంచెట్టి గంగాధర్ సుద్దపల్లి శివారులో దాబా నడిపేవారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. బీఆర్ ఎస్, కాంగ్రెస్‌లో పనిచేశారు. ఆయన ఎంపీపీగానూ సేవలందించారు.




## ముగ్గురు చిన్నారుల హత్య బాధాకరం: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కన్నతండ్రి చేతిలో ముగ్గురు చిన్నారులు హత్యకు గురికావడం బాధాకరమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విచారం వ్యక్తం చేశారు. చిన్నారుల తల్లిని మంగళవారం తన నివాసంలో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయాన్ని అందజేసి భవిష్యత్‌లో కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఒక మనిషి ఇంత క్రూరంగా ఎలా ప్రవర్తిస్తాడు.. కన్నబిడ్డలను చంపుకోవడానికి మనసెలా ఒప్పింది.. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన అన్యాయం కాదు.. మానవత్వానికే తలవంపు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన కఠినమైన శిక్ష పడేలా న్యాయస్థానాలు చూడాలని కోరారు.




## స్పెషల్ డ్రైవ్‌లో 123 ఫోన్ల రికవరీ: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ద్వారా గత 30 రోజుల్లో రూ.20.32 లక్షల విలువైన 123 ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఫోన్లు రికవరీ చేసిన సిబ్బందిని ఎస్పీ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతినెలా వందకు పైగా మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.40 లక్షలు విలువైన 250 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. పోర్టల్ మొదలయినప్పటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 4,531 మొబైల్ ఫోన్లను గుర్తించి రూ.7.25 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగించామని పేర్కొన్నారు. మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. ఫోన్ మిస్సైతే ఆందోళన వద్దని, సీఈఐఆర్ పోర్టల్ తో తిరిగి పొందవచ్చన్నారు. బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోగొట్టుకున్న మొబైల్ పొందవచ్చని తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు రూ.3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రత్యేక బృందాన్ని అభినందించారు.





# సమస్యల తిష్ట

- వార్డుల్లో పేరుకుపోతున్న చెత్త
- మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలు
- కామారెడ్డి బల్దియా దుస్థితి
- రేపు పాలకవర్గ పరిచయ కార్యక్రమం

**కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారి ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎక్కడికక్కడ కొత్త సమస్యలు పుట్టుకొస్తుండగా పాత సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఏడాదికిపైగా పాలకవర్గాలు లేకపోవడంతో బల్దియాలో ఈ దుస్థితి నెలకొంది. పర్యవేక్షణ కరువవడంతో వార్డుల్లో చెత్త పేరుకు పోయింది. దీంతో కొత్తగా కొలువుదీరిన పాలకవర్గానికి ఎక్కడ చూసినా సమస్యలే దర్శనం ఇస్తున్నాయి. కాలనీలకు వెళ్తే ప్రజలు సమస్యలను ఏకరువు పెడుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులున్నాయి. ఇందులో 7 విలీన గ్రామాలుండగా మిగతా మొత్తం కామారెడ్డి పట్టణం విస్తరించి ఉంది. అయితే పట్టణంలో సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టు కొస్తున్నాయి. ముఖ్యంగా పారిశుధ్యంపై పర్యవేక్షణ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడాదికిపైగా పాలకవర్గం లేకపోవడంతో డ్రెయినేజీలు కూడా సరిగ్గా తీయలేదన్న విమర్శలు ఉన్నాయి.

### సిబ్బంది ఇష్టారాజ్యం

ప్రభుత్వం ఇటీవల మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. గత నెల 16న కామారెడ్డి పాలకవర్గం ప్రమాణ స్వీకారం జరగగా 23న ఛైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలకవర్గం సమావేశం నిర్వహించలేదు. మరోవైపు వార్డుల్లో శానిటేషన్ పనులు సక్రమంగా సాగడం లేదు. అవసరమైన సిబ్బంది కూడా ఉండడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పలువురు సిబ్బంది కేవలం కాగితాలకు పరిమితం అయ్యారన్న విమర్శలు సైతం ఉన్నాయి. వాళ్లు హాజరు వేసుకుని ఎక్కడ పని చేస్తున్నారో తెలియడం లేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

### వాహనాలకు మరమ్మతులు

బల్దియాలో 49 వార్డులుండగా 42 చెత్త సేకరణ వాహనాలు ఉన్నాయి. ఇందులో 10 నుంచి 15 వాహనాలు రిపేరులో ఉన్నట్టుగా తెలుస్తోంది. మిగిలిన వాటితోనే బల్దియాలో చెత్త సేకరణ చేపడుతున్నారు. దాంతో వారంలో రెండు మూడు సార్లు మాత్రమే చెత్త సేకరించే పరిస్థితి నెలకొంది. ఫలితంగా వార్డుల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

### కౌన్సిలర్ల ఆగ్రహం

కొన్ని వార్డుల్లో చెత్త సేకరణ సమస్య సవాలుగా మారుతోంది. పట్టణంలో దాదాపు నాలుగైదు వార్డుల విస్తరణ పెద్దగా ఉంది. ఈ వార్డుల్లో ఒకే వాహనంతో చెత్త సేకరణ చేపట్టడం అసాధ్యం. వచ్చే ఒక్క వాహనం కూడా తరచుగా రిపేర్ కావడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు రిపేర్ చేయించాలని అధికారులను అడిగితే డబ్బులు లేవని చెబుతున్నారని మండి పడుతున్నారు. కొందరు కౌన్సిలర్లు సొంత ఖర్చులతో వాహనాలకు రిపేర్ చేయిస్తున్నట్టు సమాచారం.

### తాగునీటి కటకట

కామారెడ్డి పట్టణంలో తాగునీటి కొరతపై ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గోదావరి జలాల పనులు కొనసాగుతుండడంతో ఇప్పటికిప్పుడు తాగునీటి సమస్య తీర్చడం పాలకవర్గానికి సవాల్‌గా మారుతోంది. ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా.. అనుకున్నంత ఫలితాన్నివ్వడం లేదు. పట్టణంలోని ఓ వార్డులో మోటార్ కాలిపోయి 25 రోజులు కావస్తున్నా ఇప్పటికి రిపేర్ చేయించడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మోటార్ అడిగితే తీర్మానం చేయాలని చెబుతున్నారని, ఓ కౌన్సిలర్ వార్డులో మాత్రం తీర్మానం లేకున్నా ఒకే రోజులో కొత్త మోటార్ ఇచ్చారని పేర్కొన్నారు.

### రేపు పరిచయ కార్యక్రమం

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం రోజు కౌన్సిలర్లు, అధికారులకు మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఎట్టకేలకు నూతన పాలకవర్గ పరిచయ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఇప్పటికే కౌన్సిలర్లకు సమాచారం కూడా ఇచ్చినట్టుగా తెలుస్తోంది. అయితే వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. పరిచయ కార్యక్రమ సమావేశం సజావుగా సాగుతుందా.. సమస్యల పరిష్కారానికి వేదికగా మారుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### రిపేరు చేయిస్తాం



బల్దియాలో 42 చెత్త సేకరణ వాహనాలు ఉన్నాయి. ఇందులో 10 రిపేరులో ఉన్నాయి. వాటిని త్వరలోనే రిపేర్ చేయిస్తాం. వార్డుల్లో చెత్త సేకరణకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– **రాజేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

## పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. మండలంలోని బోర్లం గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా వెంటనే తొలగించాలని సూచించారు. అలాగే మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చి పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. గ్రామాల్లో అధికారులు ప్రతిరోజు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఆస్తి పన్ను వసూలు చేయడంలో ప్రత్యేక సిబ్బంది మరింత వేగవంతంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ జోన్ 2 కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మొండి బకాయిలను కచ్చితంగా వసూలు చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి యజమానులను కలవాలని సూచించారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కార్యాలయంలోని అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. కమిషనర్ వెంట డీఈ సాయిచంద్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణ లేదు..: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ ఆలయాలకు రక్షణ లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని గోపాల్ బాగ్ ప్రాంతంలో ఉన్న పురాతన శివాలయంపై మూడు రోజుల క్రితం కొందరు దాడి చేశారన్నారు. విగ్రహాలను పూర్తిగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో హిందువులు, హిందూ ఆలయాలపై దాడులు పెరిగాయని విమర్శించారు. ఇన్ని జరిగినా సీఎం మంత్రులు ఒక్కసారి కూడా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. మాట్లాడితే సెక్యులర్ అని చెప్పే కాంగ్రెస్ హిందువులపై దాడి జరిగితే ఎందుకు ప్రశ్నించడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నిజమైన సెక్యులర్ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. మోదీ సర్కారు 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అని.. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తోందన్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం ఒక వర్గానికి మాత్రమే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. కేవలం అధికారం కోసం దిగజారి పనిచేస్తున్నారని విమర్శించారు. శివాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ధన్‌పాల్ డిమాండ్ చేశారు. దాడిచేసిన వారిని అరెస్ట్ చేసిన ఇప్పటివరకు రిమాండ్ చేయకపోవడం తగదన్నారు. పోలీస్ కమిషనర్ స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గోశాల సమీపంలో స్థలం కబ్జాకు గురవుతుందని, ఇటీవల ప్రార్థన మందిరాన్ని కూడా నిర్మించారని చెప్పారు. వీటిపై కలెక్టర్‌తో పాటు సీపీ దృష్టిసారించి తొలగించాలని డిమాండ్ చేశారు. హిందువుల సహనాన్ని ఓపికను చూస్తున్నారని, ఒకసారి కాషాయం ఓపిక నశిస్తే ఎవరూ తట్టుకోలేరన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, ఇప్పకాయల కిషోర్ నాయకులు పాల్గొన్నారు.




## ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి..: మహేశ్‌కుమార్ గౌడ్

**అక్షరటుడే, ఇందూరు:** ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షా స్వాములకు హనుమాన్ జంక్షన్ ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీసీసీ చీఫ్ స్వయంగా హనుమాన్ స్వాములకు వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తి, సేవ అనేవి భారతీయ సంస్కృతికి మూలస్తంభాలని పేర్కొన్నారు. హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని కోరుకుంటున్నానన్నారు. దీక్షలు తీసుకున్న భక్తుల ఆత్మనిబద్ధత, నియమ నిష్టలు యువతకు ఆదర్శమని తెలిపారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పరస్పర సహకారం, సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పీసీసీ చీఫ్ అన్నారు. హనుమాన్ దీక్షా స్వాములకు అన్నప్రసాదం పంపిణీ చేయడం ద్వారా సేవా భావాన్ని చాటుతున్న నగర కాంగ్రెస్ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, హనుమాన్ దీక్షా స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





www.aksharatoday.in
అక్షర టుడే TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
మంగళవారం
10.3.2026
AKSHARA TODAY

## భల్లూక వేషం.. వానరాలు పరార్..



గాంధారి మండలంలోని పోతంగల్ కుర్దు గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఒక మనిషికి ఎలుగుబంటి వేషం వేయడంతో కోతులు ఎలుగు బంటిని చూసి పరిగెడుతున్నాయి. కోతులు గ్రామంలోకి అడుగుపెట్టేందుకు భయపడుతున్నాయి. దీంతో తమ ఐడియా ఫలించిందని.. సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ శేఖర్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే గాంధారి



## మున్సిపల్ కమిషనర్‌పై బీజేపీ కౌన్సిలర్ల ఫైర్..

**అక్షరటుడే, కామారెడ్డి:** వార్డుల్లో శానిటేషన్ లేబర్లు ఎక్కడ పని చేస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ప్రశ్నించారు. తమ వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను కమిషనర్ ముందు ప్రస్తావించగా కమిషనర్ నుంచి సమాధానం రాకపోవడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం విషయంలో కమిషనర్ దాటవేత ధోరణి అవలంభించడంతో వారు ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పట్టణంలో శానిటేషన్ హాజరు పట్టికలో పలువురు వర్కర్లు ఉన్నప్పటికీ వారు వార్డుల్లో పని చేయడం లేదన్నారు. హాజరు పట్టికలో మాత్రం రోజూ పని చేస్తున్నట్లు హాజరు వేస్తున్నారని పేర్కొన్నారు. వాళ్లు ఏదైనా నాయకుడి ఇంట్లో పని చేస్తున్నారా..? లేక అధికారి ఇంట్లో పని చేస్తున్నారా..? అని కమిషనర్‌ను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు. ఏ శాఖ గురించి అడిగినా కమిషనర్ సరైన సమాధానం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ లేబర్, వీధి దీపాలు, చెత్త సేకరణ బండి, చెత్త సేకరణ ట్రాక్టర్, దోమలు రాకుండా కొట్టే ఫాగ్ మిషన్, తాగునీటి ప్రణాళిక వంటి అంశాలపై వారం రోజుల్లో పరిష్కార మార్గాలు చూపాలని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించామన్నారు.





# సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

**అక్షరటుడే, ఇందూరు:** నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు భజనలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్యప్రదాత అని దేవనాథ జీయర్ స్వామి అన్నారు. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్య తేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడని పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడేనని.. అందుకే సూర్యున్ని సూర్యనారాయణుడిగా కొలుస్తున్నామని వివరించారు. సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయన్నారు. కార్యక్రమంలో యజ్ఞాచార్యులు శ్రీనివాసాచార్యులు, లక్ష్మణ ఆచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమార్ ఆచార్యతో పీసీసీ చీఫ్ మహేశకుమార్ గౌడ్, కాంగ్రెస్ నేతలు, ఆలయ ధర్మకర్తలు దిల్ రాజు దంపతులు, నరసింహారెడ్డి దంపతులు, శిరీష్ రెడ్డి దంపతులు, విజయసింహా రెడ్డి దంపతులు, హరీష్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. నర్సింగ్‌పల్లి ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బిగాల నర్సింగ్‌పల్లిలో బ్రహ్మోత్సవాల్లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా పాల్గొన్నారు. వేంకటేశుడిని దర్శించుకుని భక్తితో పూజలు చేశారు.

### బ్రహ్మోత్సవాల్లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్..

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నర్సింగ్‌పల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన జీయర్ స్వామి విచ్చేసి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులను సన్మానించారు.





## ఇజ్రాయిల్‌లో కమ్మర్‌పల్లి వాసికి గాయాలు..

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వారం రోజులుగా ఇరుదేశాల మధ్య పరస్పర భీకర దాడులు కొనసాగుతున్నాయి. దీంతో అనేకమంది నిరాశ్రయులవుతున్నారు. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం ఇజ్రాయిల్ వెళ్లిన కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కోయల్‌కర్ తిరుపతి గాయపడ్డారు. తిరుపతి అక్కడ కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఇరాన్ క్షిపణి దాడి సమయంలో ఆయన తన యజమాని కారును శుభ్రం చేస్తుండగా, పేలుడు ప్రభావంతో క్షిపణి శకలాలు కారు సమీపంలోనే పడ్డాయి. దీంతో కారు అద్దాలు పగిలి తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి తిరుపతి ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## జాబ్‌మేళాలో 22 మందికి ఇంటర్న్‌షిప్




**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. 22 మందిని ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. కళాశాల టాస్క్, ఐక్యూఏసీ, ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్ కేసీ, ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జాబ్ మేళాకు డిగ్రీ పూర్తి చేసిన 100కి పైగా మంది ఉద్యోగార్థులు హాజరై ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు పొందాలంటే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ సంపత్, కళాశాల టీఎస్ కేసీ, టాస్క్ సమన్వయకర్త గులాం ముస్తఫా, ఐక్యూఏసీ సమన్వయకర్త వినయ్ కుమార్ పాల్గొన్నారు.




## శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**అక్షరటుడే, ఇందూరు:** శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గాదెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి దంత సంరక్షణపై వైద్యుడు ముఖేష్ అవగాహన కల్పించారు. దంత రక్షణ కోసం ప్రతిఒక్కరూ రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యాభర్తల మధ్య వాగ్వాదం.. కాలువలో దూకిన ఇల్లాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగా ఓ మహిళ ఆవేశంలో నిజాంసాగర్ ప్రధాన కాల్వలో దూకింది. ఈ ఘటన వర్ని వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కోటగిరికి చెందిన భార్యాభర్తలు వర్ని బస్టాండ్ వద్ద వ్యక్తిగత కారణాలతో గొడవపడ్డారు. ఈ గొడవతో మనస్తాపానికి గురైన భార్య లక్ష్మి క్షణికావేశంలో సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాల్వలోకి దూకింది. దీనిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. కాలువలోకి దూకిన లక్ష్మిని నీటిలో నుంచి బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు తెలిపారు.

## పశువులకు టీకాలతో రైతులకు మేలు




**అక్షరటుడే, భీమ్‌గల్:** పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందే నివారణ టీకాలు వేయించడం ద్వారా పాడి రైతులు ఆర్థిక నష్టాల నుంచి గట్టెక్కవచ్చని మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండలంలోని పోచంపల్లిలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకా కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నాలుగు నెలల వయసు పైబడిన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, దయానంద్, జావీద్ పాల్గొన్నారు.

## కల్లెడిలో గాలికుంటు నివారణ టీకాలు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గంగోల్ల సుష్మిత ప్రళయ్ తేజ్, పశువైద్యాకారి సందీప్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మొత్తం 102 గేదెలు, 31 ఆవులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ.. పశువులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గాలికుంటు వ్యాధి సాధారణంగా దోమల ద్వారా వ్యాపిస్తుందని, ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు తీవ్రమైన సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. టీకా వేయించడం ద్వారానే గాలికుంటు వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు మారుతి, లడ్డు సాయన్న, పల్లోల రాజేశ్వర్, నక్క సంపత్, బాబన్న, రోజారాణి పాల్గొన్నారు.

## పంచాయతీల్లో గ్రామసభలు..



**అక్షర టుడే గాంధారి:** గాంధారి మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్‌లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు.. మురికి కాల్వల వద్ద నీరు నిలవకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతి వీధిలో వీధిలైట్ల గురించి చర్చించారు. ఈ సమస్యలపై దృష్టి సారించాలని తీర్మానించారు. తాగునీటి సమస్య ఎక్కడా రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని.. ఇప్పటి నుంచే కసరత్తు చేయాలని నిర్ణయించుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వార్డు మెంబర్లను సన్మానించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ రేణుక సంజీవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, వార్డ్ మెంబర్లు సెక్రెటరీ నాగరాజు, తిమ్మాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.





## గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే..

తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉమ్మడిజిల్లాలో ఆమె విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధి, సమాన హక్కుల కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్

## రోడ్డు ప్రమాదంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డు ప్రమాదంలో రామారెడ్డి మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారెడ్డి మోహన్ రెడ్డి (55) మృతి చెందారు. మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన నారెడ్డి మోహన్ రెడ్డి హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వస్తుండగా రోడ్డు పక్కన చెట్టును కారు ఢీకొంది. ఈ ఘటనలో మోహన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. కారు డ్రైవర్, కారులో ఉన్న మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మాజీ జడ్పీటీసీ సభ్యుడి మరణంతో రామారెడ్డి మండలంతో పాటు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా.. మోహన్ రెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వస్తున్నారు. రామారెడ్డి జడ్పీటీసీగా కూడా పనిచేశారు. నారెడ్డి స్వచ్ఛంద సంస్థ పేరిట నిరుపేదలకు ఆర్థిక సాయం అందజేస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించేవారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందారు. దాంతో ఆయనకు జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా అవకాశం కల్పించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే గొంతుకగా పని చేసేవారు. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలపై చర్చించేవారు. దాంతో అందరిలో ఆయనకు మంచి పేరు ఉంది. మాజీ జడ్పీటీసీ మరణవార్త విని కాంగ్రెస్ పార్టీ నాయకులు విచారం వ్యక్తం చేశారు.

### మోహన్ రెడ్డి మృతి తీరని లోటు: షబ్బీర్ అలీ

రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి, తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మోహన్ రెడ్డి మృతిపట్ల ఆయన సంతాపం తెలిపారు. మోహన్ రెడ్డితో ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, పార్టీకి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే గొప్ప నాయకుడిని మనం కోల్పోయామన్నారు.